క్లుప్తంగా

రామాలయంలో అన్నదానం

సామర్లకోట: పట్టణంలోని సంతమార్కెట్‌లో ఉన్న రామాలయంలో ఆదివారం జరిగిన సీతారాముల కల్యాణం సందర్భంగా కమిటీ నిర్వాహకులు సోమవారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆలయంలో పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అగ్నికుల క్షత్రియుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కౌన్సిలర్లు పిల్లాడి సత్యవతి, బలుసు వాసు, రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు, బడుగు శ్రీకాంత్, వల్లూరి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం

సామర్లకోట: గోదావరి కాలువ గట్టున ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్యనారాయణ స్వామి గ్రామోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. స్వామివారి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పూలు, విద్యుద్దీపాలతో అలంకరించిన గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి కాలిబాట వంతెన, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గోలి వారి వీధి, గాంధీచౌక్, చిన్న వీధి, పెద్దవీధి, యార్లగడ్డవారి వీధి, మఠం సెంటర్, అయోధ్య రామపురం, కొత్తూరు నుంచి గ్రామోత్సవం ఆలయానికి చేరింది. భక్తుల ఇళ్ల వద్దకు స్వామి వారి రథం రావడంతో, వారు మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం స్వామి, అమ్మవార్లకు మంగళస్నానాలు, రాత్రి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు.

శ్యామల ప్రతిభ అభినందనీయం



శ్యామలను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

పెద్దాపురం: స్విమ్మింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గోలి శ్యామల అభినందనీయురాలని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి అన్నారు. పెద్దాపురం ఆదిత్య పబ్లిక్ స్కూల్‌లో సోమవారం శ్యామలను విద్యా సంస్థల తరఫున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల కో–ఆర్డినేటర్ రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు దేశానికి కీర్తి తెచ్చే సాహస కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. సుమారు 160 కి.మీ. స్విమ్మింగ్ చేసి ఉత్తమ ప్రతిభ కనపర్చిన శ్యామల సామర్లకోట పట్టణానికి చెందినవారు కావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

11న పెద్దాపురంలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో పెద్దాపురంలోని ఎస్ఆర్‌వీబీఎస్‌జేబీ మహారాణి కాలేజీలో ఈ నెల 11న జరిగే మెగా జాబ్ మేళా జరగనుంది. ఈ పోస్టర్‌ను కలెక్టర్ షణ్మోహన్ సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. సుమారు 35 ప్రముఖ కంపెనీల్లో 1,097 ఉద్యోగాలకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తారని చెప్పారు. జిల్లాలో అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో జె.వెంకటరావు, వికాస పీడీ కె.లచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం



రామాలయం వద్ద కోలాటం ప్రదర్శన

సామర్లకోట: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా హుస్సేన్‌పురం గ్రామంలోని రామాలయం వద్ద సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కోలాటంలో భక్తి పాటల ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే చినరాజప్ప, స్థానిక పెద్దలు ఈ ప్రదర్శనను తిలకించారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

బోట్‌క్లబ్: నగరంలోని పెద్ద మార్కెట్‌లో ఉన్న నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో జరిగే అన్నదానానికి కాకినాడకు చెందిన యాళ్ల అయ్యన్న, యాళ్ల లక్ష్మి, పసుపులేటి సీతామహాలక్ష్మి, లంకా చాందిని రూ.లక్ష విరాళం అందజేశారు. సోమవారం ఆలయ ఈవో ఎం.మురళీవీరభద్రరావుకు ఈ మొత్తం అందజేశారు. దాతలను సత్కరించి, ప్రసాదాలు అందించారు. రూ.లక్ష వడ్డీతో ఏటా అమ్మవారి ఆలయంలో జరిగే పెద్ద జాగారం రోజున అన్నదానానికి వినియోగించాలని దాతలు కోరినట్లు ఈవో తెలిపారు.

తవ్వితే తగువే..

- చెరువును కాపాడాలంటున్న గ్రామస్తులు
- పాపిడిదొడ్డి చెరువులో మట్టి తవ్వకాలకు సన్నాహాలు!
- వ్యతిరేకిస్తున్న స్థానికులు
- అధికారులకు ఫిర్యాదులు



ఎఫ్‌కే పాలెంలోని పాపిడిదొడ్డి చెరువు



ఎఫ్‌కే పాలెం పాపిడిదొడ్డి చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో కొందరు నేతలు భారీగా మట్టి అక్రమ తవ్వకాలకు సిద్ధ పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి ఎటువంటి సీనరేజ్, సెస్ చెల్లించకుండా, కనీసం ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలించుకుపోవడానికి ఏర్పాట్లు చేస్తున్నారని రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పిఠాపురం మండలం ఫక్రుద్దీన్‌పాలెం–విరవాడ గ్రామాల మధ్య సర్వే నంబర్ 17లో సుమారు 80 ఎకరాల్లో ఉన్న పాపిడిదొడ్డి చెరువులో అక్రమంగా మట్టిని తరలించుకుపోవడానికి కూటమి పెద్దలు ప్రయత్నాలు సాగిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువును తవ్వి, భారీగా మట్టిని తరలించుకుని పోయేందుకు జనసేన పార్టీకి చెందిన కొందరు నేతలు సిద్ధంగా ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిలో భాగంగా ఇటీవల మట్టి తవ్వకాలు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయగా, స్థానిక రైతాంగం అడ్డుకున్నారు. అధికార పార్టీ ముఖ్య నేతల కనుసన్నల్లో అక్రమ తవ్వకాలు, రవాణా జరిపేందుకు ఏర్పాట్లు చేయగా.. అడ్డుకున్న గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఎఫ్‌కేపాలేనికి చెందిన రైతులు జవ్వాది కృష్ణమాధవరావు, ముమ్మిడి వెంకన్నబాబు, మలిరెడ్డి పల్లవు రాజా, రామిరెడ్డి వెంకట రమణ, ముమ్మిడి తాతకొండ, మురళీ, ముమ్మిడి సూరిబాబు తదితరులు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఫిర్యాదు చేశారు. అనంతరం పెద్దాపురం ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయించాలని మైనింగ్ అధికారులకూ ఫిర్యాదులందాయి.

సాగునీటికి ఇబ్బందులు

చెరువులో మట్టి తవ్వకాలు జరిగితే పొలాలకు పూర్తిగా సాగునీరు అందని పరిస్థితి ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న ఉపాధి కూలీలకు ఈ చెరువు ఆధారంగానే పని దొరుకుతుందని, చెరువులో తవ్వకాలు జరిపితే వారి ఉపాధి దెబ్బతింటుందన్నారు. అధికార పార్టీ నేతలు అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

వ్యవసాయం దెబ్బ తింటుంది



చెరువులో మట్టి తవ్వకాలు జరిపితే స్థానికంగా వ్యవసాయం దెబ్బతింటుంది. వందల ఎకరాల సాగుకు ఆటంకం ఏర్పడుతుంది. సాగు నీటి ఇబ్బందులు ఎదురవుతాయి. చెరువులో తవ్వకాలు జరపడం వల్ల చెరువు గర్భం లోతుగా మారి, సాగు నీరు పొలాలకు వచ్చే అవకాశం ఉండదు. దీంతో పంట సాగు కష్టం అవుతుంది. ఈ చెరువుపై ఆధారపడి వందల ఎకరాల భూమిలో వ్యవసాయం జరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వరాదని కోరుతున్నాం. ఒకవేళ కాదని ఇస్తే అడ్డుకుంటాం. తీవ్రంగా ఉద్యమిస్తాం.

– రెడ్డి సత్యనారాయణ, కౌలు రైతు

తవ్వితే తరిమికొడతాం



చెరువులో తవ్వకాలు జరిపితే తరిమికొడతాం. ఎట్టి పరిస్థితుల్లోను తవ్వకాలు జరపనివ్వం. గ్రామానికి చెందిన వందల మంది వ్యవసాయ కార్మికులకు ఈ చెరువు ఆధారంగా అధికారులు పనులు కల్పిస్తున్నారు. చెరువులో మట్టిని అక్రమంగా తరలించుకుపోతే అందరికీ ఉపాధి పనులు ఉండవు. మా పొట్ట కొట్టే విధంగా కొందరు నేతలు ప్రయత్నాలు చేయడం సరికాదు. మట్టి తవ్వకాల ప్రయత్నాలు మానుకోవాలి. మా ఉపాధిని దెబ్బ తీయడంతో పాటు, వ్యవసాయానికి ఇబ్బంది కలిగించే మట్టి తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లోను జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎటువంటి అనుమతులు ఇవ్వకూడదు.

– రామిరెడ్డి వెంకటరమణ, రైతు, ఎఫ్‌కే పాలెం

ముగిసిన వసంత నవరాత్ర పూజలు

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలు



కుమారారామ భీమేశ్వరస్వామివారు



బాలాత్రిపురసుందరి అమ్మవారు

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో సోమవారం, దశమి పర్వదినం కావడంతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో ఉగాదిని పురస్కరించుకుని గత నెల 30న వసంత నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు సోమవారంతో ముగియడంతో స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉన్న ఉప ఆలయాల్లోను ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి ప్రీతైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి, స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించిన భక్తులు, సాయంత్రం వసంత నవరాత్ర ముగింపు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్న ప్రసాదం, సాయంత్రం శనగలు ప్రసాదంగా ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిదిరాజు వెంకన్న పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్



అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారం కోసం పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా సోమవారం డివిజన్ పరిధిలో ఆయా మండలాల నుంచి ఆరు అర్జీలు అందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డీఓ విలేకర్లతో మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, హౌసింగ్ అధికారి రవిశంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు నష్టం లేకుండా చర్యలు

జిల్లా పౌర సరఫరాల అధికారి నాయక్



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పిఠాపురం: రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాల వల్ల రైతులు నష్ట పోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి ఎండీ నాయక్ తెలిపారు. ఆయన మండల వ్యవసాయ అధికారి కేవీవీ సత్యనారాయణతో కలిసి సోమవారం వర్షాలకు ధాన్యం తడిసిన గొల్లప్రోలు మండలంలో వివిధ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్య శాంపిళ్లను సేకరించారు. ఆయన మాట్లాడుతూ, రైతులు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకొంటున్నారని, ప్రస్తుతానికి పెద్దగా నష్టం వచ్చే అవకాశాలు లేవన్నారు. ఎక్కడా పెద్దగా ధాన్యం తడవలేదని, అక్కడక్కడా కొద్దిగా తడిసినా రెండు రోజులు ఆరబెడితే నష్టం ఉండదన్నారు. ఎక్కువగా కోత కోసి మిల్లులకు తరలించడానికి సిద్ధం చేసిన ధాన్యం తడిసిందని, వాటి శాంపిళ్లను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో 8 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గొల్లప్రోలు, తాడిపర్తి, కొడవలి, చెందుర్తి, ఎ.విజయనగరం, మల్లవరం, చేబ్రోలు–1, చేబ్రోలు–2 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. సిబ్బంది ధాన్యం శాంపిళ్లను తీసుకుని, తేమ 17 శాతం వచ్చిన వాటిని కొనుగోలు చేసేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మళ్లీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్లు

సర్వశిక్షా రాష్ట్ర పరిశీలకురాలు భారతి



సామర్లకోటలో స్టాక్ పాయింట్ పరిశీలనకు వచ్చిన రాష్ట్ర పరిశీలకులు, సీఎంఓ, ఎంఈఓలు

సామర్లకోట: పాఠశాలలు పునః ప్రారంభించే నాటికి విద్యార్థులందరికీ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్టూడెంట్ కిట్లను అందజేస్తామని సర్వశిక్షా రాష్ట్ర పరిశీలకురాలు బి.భారతి అన్నారు. పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా ఇస్తున్న పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాం భద్రపరిచే స్టాక్ పాయింట్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు నోట్ పుస్తకాలతో పాటు, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం ఇవ్వాలని నిర్ణయించారన్నారు. ప్రతి పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యను ముందుగానే సేకరించినట్టు చెప్పారు. పుస్తకాల కొరత లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలను పొందుపర్చామన్నారు. ఆమె వెంట సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విస్తృత అవగాహన కల్పించాలి

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ఆర్డీఓ శ్రీరమణి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సరిత. చిత్రంలో ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆర్డీఓ కె.శ్రీరమణి ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.సరిత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ, అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణ పరీక్షలకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డాక్టర్ సరిత మాట్లాడుతూ, పెద్దాపురం డివిజన్ పరిధిలో 40 స్కానింగ్ కేంద్రాలకు రిజిస్ట్రేషన్, రెన్యువల్ జరిగిందన్నారు. ఆయా కేంద్రాల్లో డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్టు వివరించారు. తొలిసారి తప్పు చేసిన వారికి చట్ట ప్రకారం మూడేళ్ల జైలు, రూ.10 వేల అపరాధ రుసుం, రెండోసారి తప్పు చేస్తే ఐదేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తారన్నారు. చట్టంపై అవగాహన కల్పించేందుకు 715 సచివాలయ కేంద్రాల్లో ఫ్లెక్సీలు పంపిణీ చేశామన్నారు. ఈ సమావేశంలో వైద్యులు అనూష, సత్యవంశీ, రాజేశ్వరి, న్యాయవాదులు కందుల వెంకటాచలం, సత్యరవికుమార్, ఎన్‌జీఓ సభ్యులు వాసవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సామర్లకోట: పట్టణంలోని బ్రౌన్‌పేటలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ యు.మీనామాధురి తెలిపారు. ఈ మేరకు సోమవారం విద్యార్థుల నుంచి ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి అధ్యాపకులు కృషి చేస్తున్నారని తెలిపారు. విశాలమైన, ప్రశాంత వాతావరణంలో ఉన్న కళాశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో ఉచితంగా విద్యార్థులకు విద్య అందించడంతో పాటు, అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు వివరించారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు అందజేస్తారన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి అడ్మిషన్లు స్వీకరించడంతో పాటు, క్లాసులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌గా ఉన్న పాఠశాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జూనియర్ కళాశాల స్థాయికి పెంచింది.

బీచ్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు

కొత్తపల్లి: ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి నుంచి 13వ తేదీ వరకు వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్టు ఎస్సై జి.వెంకటేష్ తెలిపారు. వాకలపూడి సమీపంలో ఉన్న బీచ్ రోడ్డులో భారత, అమెరికా సంయుక్త సైనిక విన్యాసాలు టైగర్ ట్రయాంఫ్ కార్యక్రమం జరగనున్న కారణంగా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్టు చెప్పారు. ఉప్పాడ నుంచి బీచ్ రోడ్డు వైపు వెళ్లే వాహనాలు పిఠాపురం, కొమరగిరి మీదుగా ప్రయాణించాలని తెలిపారు. పర్యాటకులకు బీచ్ రోడ్డులో ప్రవేశం లేదన్నారు. వాహనచోదకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

రాజకీయ కక్షతో తప్పుడు కేసు

సామర్లకోట: తనకు సంబంధం లేని విషయాలపై రాజకీయ కక్షతో తప్పుడు కేసులు పెడుతున్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌ను కలిసి స్థానిక పోలీసుల తీరుపై ఫిర్యాదు చేసినట్టు సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లకు తెలిపారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబుతో ఉన్న సమయంలో తనపై తప్పుడు సమాచారంతో కేసు నమోదు చేశారని తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి, తనకు న్యాయం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు నిరసనగా కాకినాడలో ధర్నా చేయడంతో కక్ష పూరితంగా తప్పుడు కేసు పెట్టారని హరిబాబు తెలిపారు.

కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభం

పెద్దాపురం: మండలంలోని దివిలి, కాండ్రకోట గ్రామాల్లో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళలకు కుట్టు శిక్షణా కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల బాబు వీటిని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి ఎంపీడీఓ శ్రీలలిత అధ్యక్షత వహించారు. పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

పాడా పీడీ చైత్రవర్షిణి



అర్జీలు స్వీకరిస్తున్న పాడా పీడీ చైత్రవర్షిణి

పిఠాపురం: పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా) పరిధిలో వచ్చిన ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని పాడా పీడీ చైత్రవర్షిణి అధికారులకు ఆదేశించారు. ఆమె సోమవారం పిఠాపురం పాడా కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి సోమవారం పాడా కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల సదస్సు నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ గ్రీవెన్స్‌లో మొత్తం 67 అర్జీలు వచ్చాయని, వాటిలో రెవెన్యూ 20, మున్సిపాలిటీ 29, ఇతర సమస్యలపై 18 అర్జీలున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాడా ఏపీడీ వసంతమాధవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అడ్వాన్స్ పన్ను చెల్లింపుపై రాయితీ

సామర్లకోట: మున్సిపాలిటీకి సంబంధించిన ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు అడ్వాన్సుగా ఏక మొత్తంలో చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రత్యేక జీవో విడుదలైందని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన పన్నులను ఈ నెల 30లోగా చెల్లిస్తే రాయితీ వర్తిస్తుందన్నారు. మున్సిపాలిటీలోను, సచివాలయంలోను పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. సెలవు దినాల్లో కార్యాలయాలు పని చేస్తాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి రుణాలకు దరఖాస్తుల పరిశీలన



అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట: వివిధ కార్పొరేషన్ల ఉపాధి రుణాల కోసం అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తుల పరిశీలన సోమవారం జరిగింది. ఆయా కార్పొరేషన్లకు చెందిన 75 యూనిట్లకు 1,907 మంది హాజరైనట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. కాపు కార్పొరేషన్ 30 యూనిట్లకు 762 మంది, మేదరి, కుమ్మరి, శాలివాహలకు 4 యూనిట్లకు 13 మంది, ఆర్యవైశ్యులకు ఒక యూనిట్‌కు 63 మంది, కమ్మ ఒక యూనిట్‌కు 101 మంది, క్షత్రియులు ఐదుగురు, బ్రాహ్మణ ఒక యూనిట్‌కు ఇద్దరు, ఈబీసీ ఒక యూనిట్‌కు ఎనిమిది మంది హాజరయ్యారు. ఆయా బ్యాంకుల, కార్పొరేషన్ల అధికారులు స్థానిక టీటీడీసీలో దరఖాస్తుల పరిశీలన నిర్వహించారు. మండల పరిధిలోని బీసీ, కాపు, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ల రుణాల కోసం 2,308 మంది దరఖాస్తులు చేయగా, రెండు వేల మంది హాజరైనట్టు ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలన జరిగింది.

ఆక్వా జోన్‌లో నమోదు చేయించుకోవాలి



అరట్లకట్ట గ్రామసభలో మాట్లాడుతున్న వీఎఫ్‌ఏ

కరప: ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం పొందాలన్నా, విద్యుత్ వినియోగంలో రాయితీ రావాలన్నా ఆక్వా జోన్ పరిధిలో ఉండాలని వీఎఫ్ఏ వి.గాయత్రీ రమాదేవి అన్నారు. మండలంలోని అరట్లకట్ట, జెడ్.భావారం గ్రామాల్లో సోమవారం జరిగిన గ్రామసభల్లో ఆమె మాట్లాడారు. ఆక్వా జోన్‌లో లేని రైతులు తమ చెరువుల వివరాలతో నమోదు చేయించుకుని రెగ్యులర్ చేయించుకోవాలన్నారు. కరెంట్ సబ్సిడీ, ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించాలంటే తప్పనిసరిగా ఆక్వా జోన్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. పంట నమోదు కూడా చేయించుకోవాలని సూచించారు. సర్పంచ్ గోపి సత్యవేణి, పంచాయతీ కార్యదర్శి వై.రాంజీ, ఏఈఓ ప్రశాంత్, వీఏఏ స్వర్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



కుక్కుటేశ్వరస్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

పిఠాపురం: పవిత్ర పాదగయ క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి దేవి, పురూహూతికా అమ్మవారు, దత్తాత్రేయ స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణలు చేశారు. స్వామివారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించారు.